# శ్రీశ్రీశ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం-ఉపమాక క్షేత్రం

ఉపమాక గ్రామం, నక్కపల్లి మండలం,

విశాఖపట్టణం జిల్లా, ఆంధ్రప్రదేశ్.

## సంగ్రహ చరిత్ర

శ్లో॥ ఏకేన శంఖమపరేణ కరేణ చక్రం – అన్యేన ఖడ్గ మితరేణ ధనుస్సుబాణం ।
వామేశ్రియం పరిధరం తురగాధి రూఢం – పాయాత్సమాం ఖగనగ స్థిత వేంకటేశ ॥

శ్లో॥ ఏకహస్తం కటించైవ వామే శంఖం చ నిక్షిపేత్ ।
దక్షిణే చక్ర హస్తంతు ఏకం వైకుంఠ హస్తకం ।
అలర్ మేల్‌మంగ సంయుక్తం వేంకటేశ మహాంభజే ॥

ఒక చేతిలో శంఖమును, దక్షిణ హస్తమున చక్రమును, మరియొక చేతిలో ఖడ్గమును ఇతర హస్తమున ధనుర్బాణములను వామ భాగమున లక్ష్మీదేవిని ధరించి అశ్వారూఢుడై గరుడ పర్వతమున నివసించు శ్రీ వేంకటేశ్వరుడు మమ్ము కాపాడు గాక!

ఒక హస్తాన్ని కటిభాగమున నుంచి ఎడమ చేతిలో శంఖమును, కుడిచేతిలో చక్రాన్ని, నాలుగవ చేతిని అభయహస్తముగా ధరించి అలర్‌మేల్‌మంగతో కూడిన వేంకటేశ్వరుని భజింతును.

"కలౌ వేంకటనాయక" అన్నట్లుగా, అంటే కలియుగమున శ్రీమన్నారాయణుడు కల్కి (వేంకటేశ్వరస్వామి) అవతారమున వేంచేస్తారు అని పురాణాలు – ఘోషిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఉపమాక వేంకటేశ్వరస్వామివారు. దశావతారములలో పదవ అవతారం. కల్కి అవతారంగా వేంచేసి ఉంటారు. శ్రీమన్నారాయణుడు గరుత్మంతునకు గొప్ప గొప్ప ఋషీశ్వరులకు ఇచ్చిన వరప్రభావము వలన స్వామి కలియుగమున షడ్భుజములతో, లక్ష్మి సమేతుడై, అశ్వారూఢుడై వేంచేసారు.

అనగా ఇక్కడ వేంకటేశ్వరస్వామి ఆరు భుజములు కలిగి ఉంటారు. అందు అయిదు హస్తములయందు దుష్టశిక్షణా శిష్టరక్షణా చేయు పంచాయుధములను ధరించి, ఒక హస్తమును భక్తవత్సలుడు అను సద్గుణమునకు సంపూర్ణ అర్థమిచ్చు అభయహస్తముతోను, గుఱ్ఱము మీద కూర్చుని క్రింద వామభాగమున (ఎడమవైపున) లక్ష్మీదేవితో కలిసి వేంచేసి ఉంటారు. ప్రపంచములోనే ఎక్కడా లేని విధముగా స్వయంభువుగా వేంచేసిన క్షేత్రం. ఉపమాక అను నామము పురాణములోనే కలదు. ఉపమాక అనగా ఉపమానము లేనిది (సాటిలేనిది) అని. ఇటువంటి క్షేత్రం ఎక్కడా ఉండదు అని అర్థం వచ్చునట్లు పురాణములోనే తెల్పిరి.

- ద్వాపర యుగాంతమందు గరుత్మంతుడు కృష్ణ భగవానుని ఎల్లవేళల తన మూపురము (వీపుపై) పై ఉండునటుల వరము కోరగా, దక్షిణ సముద్ర తీరమందు గరుడుడు పర్వతముగా నెలకొని ఉండగా తాను వేటకు వచ్చి ఆ కొండపై స్థిరపడగలనని భగవంతుడు శ్రీమన్నారాయణుడు వరము ఇచ్చిరి.

- క్రీ.శ. 6వ శతాబ్దము నందు తూర్పుగోదావరి జిల్లా కాండ్రేగుల సంస్థానమునకు అధిపతులు శ్రీ కృష్ణ భూపాలుడు శ్రీ స్వామివారికి ఆలయము నిర్మించినట్లు క్షేత్ర మాహాత్యము నందు పొందుపరచబడి యున్నది. ఆ స్వామిని గూర్చి బ్రహ్మవైవర్త పురాణమునందు (గరుడాచల మహాత్మ్యం) కూడా ఈ విషయము పేర్కొనబడినది.

- 17వ, 18వ శతాబ్దములలో పిఠాపురం సంస్థానమునకు చెందిన ప్రభువు ముచ్చటపడి ఎంతో విలువైన పచ్చలు, వజ్రాలు పొదిగిన కిరీటము చేయించుకుని ఒక శుభముహూర్తమున ధరించుదామని అనుకుని ఏర్పాట్లు చేసుకున్నారట. శుభముహూర్తమునకు ముందురోజున ఆ రాజునకు స్వప్నమున స్వామి దర్శనమిచ్చి, ఉపమాక క్షేత్రమున నేను వేంచేసి ఉండగా నాకు సమర్పించక నీవు ధరించెదవా అని అడుగగా, మరునాడు గొప్ప సైన్యముతోను, గజములు, అశ్వములతో గూడి గొప్ప ఊరేగింపుగా వచ్చి శ్రీ స్వామివారికి కిరీటము సమర్పించెను.

- బ్రౌన్ దొరగారు కూర్చిన హిందు దేవాలయాల చరిత్రలో కూడా ఈ ఉపమాక దేవాలయము ప్రసక్తి కలదు. ప్రస్తుతము ఈ గ్రంథము మద్రాసు (చెన్నై) Connemere గ్రంథాలయమునందు దానిని మనము చూడగలము.

- జగద్గురు శ్రీ త్రిదండి రామానుజాచార్యుల వారు భారతదేశమందలి 108 క్షేత్రములు దర్శించి శ్లోకరూపమున 108 క్షేత్రములు వర్ణించిరి. అందు "తార్క్ష్యాద్రి సింహాచలౌ" అని పేర్కొనుట చేత, తార్క్ష్యాద్రి అనగా గరుడాద్రి అగుటచేత వారి జీవితకాలం 1017 ఎ.డి. -1137 ఎ.డి. అగుట చేత ఈ క్షేత్రము చాలా పురాతనమైనదిగా గుర్తింపబడుతుంది.

- ఈ దేవాలయము నందు పూజాదికములు శ్రీ పాంచరాత్ర ఆగమ శాస్త్రమును అనుసరించి నిర్వహింపబడును. ఇక్కడ జరిగే విశేష కార్యక్రమములలో ఆయా సమయములను బట్టి పుణ్యకోటి వాహనము, పొన్న వాహనము, ఇత్తడి గరుడ వాహనము, లక్కగరుడ వాహనము, రాజాధి రాజ వాహనము, సప్పరము, హంసవాహనము, అశ్వవాహనము, గజ వాహనము, పెద్ద పల్లకి, చిన్న పల్లకి వాహనములపై శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ఉభయ నాంచారులతో కూడా

గ్రామ తిరువీధి సేవలు వైభోవేపేతముగా జరుగును. ఈ క్షేత్రము నందు ప్రతి నిత్యము ఉదయము, రాత్రివేళల యందు నాళాయిర సేవా కాలము, శ్రీ స్వామి వారికి విన్నపము జరుగును.

## క్షేత్ర విశేషాలు

- అన్ని క్షేత్రములయందు సంవత్సరమునకు ఒక్కరోజు లభించు ఉత్తరద్వార దర్శనం, ఇక్కడ మాత్రము నిత్యవైకుంఠ ద్వార దర్శనముగా వెలసిల్లుచున్నది.
- ఈ పర్వతమును దూరం నుండి చూచిన యెడల గరుడ పక్షి ఆకారంలో ఉంటుందన్న ప్రసిద్ధి, అందువలనే దీనిని గరుడాద్రిగా కూడా వ్యవహరిస్తారు.
- ఇక్కడ ప్రతిరోజు కొండపై మూల విరాట్‌కి పంచామృత అభిషేకం జరుగుతుంది. భక్తులు దగ్గరుండి అభిషేకం చేయించుకొనవచ్చును.
- ఇక్కడ ఏదైనా కోరికను స్వామివారికి విన్నవించి, అది నెరవేరిన తరువాత కాలి నడకను కొండపైకి వస్తాననుకొనిన ఆ కోరిక నెరవేరును. కోరిక నెరవేరిన పిదప తప్పక కాలినడకన కొండపైకి వెళ్ళి స్వామివారి దర్శనం చేసుకొనవలెను.
- స్వామివారు సంతాన ఫలప్రదాతగా ప్రసిద్ధి పొందారు. సంతాన ప్రాప్తి కోసం భక్తులు ప్రతిరోజు జరిగే పంచామృతాభిషేక సమయంలో స్వామివారిని దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించిన, వారికి సంతాన ప్రాప్తి కలుగునని నమ్మకం.
- ఈ క్షేత్రములో ఉన్న (రామస్థూపం) రామకోటి స్తంభం ది. 04.05.1964 న శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయ్యర్ స్వామివారి చేత ప్రతిష్ఠింపబడినది. భారతదేశంలో ఈ స్వామివారిచే ప్రతిష్ఠింపబడిన 108 రామస్థూపాలలో ఇది 48వది.
- శ్రీ స్వామివారు గరుడాద్రిపై విశ్రాంతి కోసము (పవళింపు) వేంచేసినట్లుగా విశిదమగుచున్నది.